క్లుప్తంగా

మందుల దుష్ఫలితాలపై అవగాహన పెరగాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): మందుల దుష్ఫలితాలు వచ్చినప్పుడు వెంటనే వైద్యుడిని సంప్రదించేలా ప్రజల్లో అవగాహన పెరగాలని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ అన్నారు. ఫార్మకో విజిలెన్స్ జాతీయ వారోత్సవాలను పురస్కరించుకుని వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ జెండా ఊపి ప్రారంభించగా, ఎంబీబీఎస్ మొదటి, రెండో ఏడాది విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు. ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.వెంకట రమణ, ప్రొఫెసర్ డాక్టర్ స్వరలత పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని శానిటరీ ఇన్స్పెక్టర్, స్వచ్ఛసర్వేక్షణ్ అధికారి రామకృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక 27వ డివిజన్ దుర్గాపురం శరభయ్య గుడి వీధిలో బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య సిబ్బంది, స్థానిక నాయకులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజ స్థాపన సాధ్యమని చెప్పారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు బి.వసంత కుమార్, కె.రాము, జి.ఏడుకొండలు, ఎం.రాము పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ, సాఫ్ట్ స్కిల్స్‌పై వర్క్‌షాప్

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో నలంద డిగ్రీ కళాశాలలో సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాంది స్కిల్స్ ట్రైనర్ డి.భవానీ, రజనీలు 110 మంది విద్యార్థినులకు కమ్యూనికేషన్ స్కిల్స్, గ్రూప్ డిస్కషన్, సెల్ఫ్ ఇంట్రడక్షన్, రెజ్యూమ్ ప్రిపరేషన్, హెచ్ఆర్ ఇంటర్వ్యూ టిప్స్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం అనురాధ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందిస్తే క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్లేస్‌మెంట్స్ పొందుతారన్నారు. కార్యక్రమంలో చంద్రగిరి, బి.రజనీప్రదీప పాల్గొన్నారు.

నిమజ్జనాలకు నిర్వాహకులు సహకరించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనాలు జరిపేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని గుణదల సీఐ పి.కృష్ణమోహన్ కోరారు. స్థానిక మధురానగర్‌లోని గుణదల పోలీస్‌స్టేషన్‌లో వినాయక పందిరి ఏర్పాటు చేసిన నిర్వాహకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు సహకరిస్తామన్నారు. నిమజ్జనంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, పోలీసుల సూచనలు, సలహాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులు, గుణదల పోలీసులు పాల్గొన్నారు.

బీఎన్ సూరి స్మారక పురస్కారాల ప్రదానం



విజయవాడకల్చరల్: శ్రీగణేష ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 42వ వార్షికోత్సవం సందర్భంగా సత్యనారాయణపురంలోని గిరివీధిలోని కళావేదికపై బుధవారం రంగస్థల నటీనటులు ఆచంట బాలజీ నాయుడు, అమ్ముల పార్వతిలకు రంగస్థల ప్రముఖుడు బీఎన్ సూరి స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణాజిల్లాకు చెందిన బీఎన్ సూరి 700లకు పైగా సాంఘిక పౌరాణిక నాటకాలలో నటించి తన ప్రతిభను చాటుకున్నారన్నారు. నటుడిగా, దర్శకుడిగా అనేక మందిని రంగస్థలానికి పరిచయం చేశారని తెలిపారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. పురస్కారాల సభలో మృదంగ విద్వాంసుడు అమ్ముల ప్రసాద్, గణేష ఉత్సవ కమిటీ నిర్వాహకులు గుడిపాటి రామచంద్ర దత్తు, కృష్ణమోహనరావు, పరిమి భాస్కర శర్మ బీఎన్ సూరి రంగస్థల సేవలను కొనియాడారు.

పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- 64వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం



కాపు నేస్తం లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణు



ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్రంలోని పేదలందరికీ ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అందిస్తున్నట్లు ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 64వ డివిజన్ 282వ వార్డు సచివాలయ పరిధిలో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. కండ్రిక, ఎస్ఎస్ బోస్ నగర్‌లో విస్తృతంగా పర్యటించి, 380 గడపలను సందర్శించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాల బ్రోచర్‌ను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా చూసి తెలుసుకుని, వారందరికీ మేలు చేయాలన్న ఉద్దేశంతో నవరత్న పథకాలను అమలు చేస్తున్నారని ఆయన చెప్పారు. సచివాలయ పరిధిలో 4,393మంది లబ్ధిదారులకు రూ.10.71 కోట్ల సంక్షేమాన్ని నేరుగా అందించడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

చట్ట సభలంటే టీడీపీకి గౌరవం లేదు..

చట్ట సభలంటే తెలుగుదేశం పార్టీకి గౌరవం లేదని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షానికి అధిక సమయం కేటాయించాలని, వారు ప్రస్తావించే ప్రతి అంశాన్ని తప్పనిసరిగా అటెండ్ కావాలని తొలి సమావేశాల సమయంలోనే అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. కానీ ఏ రోజైతే సమావేశాలను తెలుగుదేశం బహిష్కరించిందో, ఆ రోజే ప్రజల పట్ల, ప్రజా సమస్యల పట్ల టీడీపీకి చిత్తశుద్ధి లేదన్న విషయం తేటతెల్లమైందన్నారు. మరలా ఇప్పుడు అవినీతి కేసులో ఇరుక్కున్న చంద్రబాబుకు సానుభూతి కోసం టీడీపీ శాసనసభ్యులు సమావేశాలకు రావాలనుకోవడం ప్రజలను అవమానించడమే అవుతుందన్నారు. అసెంబ్లీ సమావేశాలకు ప్రతిపక్షం ఎందుకోసం వచ్చినా, సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని చెప్పారు. మరో వైపు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్, ఫైబర్‌నెట్ స్కామ్, అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డు, సీఆర్‌డీఏ, రాజధాని నిర్మాణం, ఏపీ సచివాలయ భవన నిర్మాణాల్లో చోటుచేసుకున్న అక్రమాలు, అవినీతి గూర్చి తెలియక పలుచోట్ల కొందరు అయ్యోపాపం అంటున్నారని, వాస్తవాలు తెలిస్తే టీడీపీని ఛీ కొట్టడం ఖాయమని మల్లాది విష్ణు అన్నారు. కార్యక్రమంలో ఈఈ (ఇంజినీరింగ్) శ్రీనివాస్, డీఈ(యూజీడీ అండ్ వాటర్ సప్లయ్) రామకృష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరావు, కార్పొరేటర్ జానారెడ్డి, జిల్లా కార్యదర్శి మేడా రమేష్, నాయకులు యర్రగొర్ల శ్రీరాములు, ఎస్‌కే ఇస్మాయిల్, జిల్లెల శివ, పందిరి వాసు, మాతా మహేష్, కొక్కిలిగడ్డ నాని, చెక్కా నరసింహారావు, వెంకటేశ్వరమ్మ, రావి విమల, తులసమ్మ, దేవిరెడ్డి సంజీవరెడ్డి, సాదం శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాపు నేస్తం వరం

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన కాపు నేస్తం అక్కచెల్లెమ్మలకు వరమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కండ్రికలోని హెల్త్ సెంటర్ ప్రాంగణంలో నాలుగో విడత కాపు నేస్తం లబ్ధిదారులతో స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మతో కలిసి బుధవారం ఆయన సమావేశమయ్యారు. వైఎస్సార్ కాపునేస్తం ద్వారా 45 నుంచి 60 ఏళ్ల లోపు ఉన్న కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చెందిన ప్రతి మహిళకు లబ్ధి చేకూరిందన్నారు. నియోజకవర్గంలోని 2,583 మంది అక్కచెల్లెమ్మల ఖాతాల్లో నాలుగేళ్లలో రూ.12 కోట్ల నగదు జమ చేశామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని అక్కచెల్లెమ్మలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. కాపు సామాజిక ప్రజలు వివాహాది శుభకార్యాలు నిర్వహించుకునే విధంగా రూ.కోటి నిధులతో కాపు కల్యాణ మండపం నిర్మిస్తున్నామని విష్ణు తెలిపారు. దివంగత నేత వంగవీటి మోహనరంగా పేరుతో నిర్మిస్తున్న ఈ కళ్యాణ మండపాన్ని వీలైనంత త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తూ ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): రాబోయే ఎన్నికల్లో నగర వాసులు సజావుగా ఓటు హక్కు వినియోగించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు సమకూర్చాలని వీఎంసీ కమిషనర్, సెంట్రల్ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. బుధవారం ఆయన సెంట్రల్ నియోజకవర్గంలోని శారద కళాశాల, చిత్తూరు పబ్లిక్ స్కూల్, టీవీ వెంకటేశ్వర రావు ఎంపీఎల్ స్కూల్, బిషప్ స్కూల్, మడోన్నా పబ్లిక్ స్కూల్, డాన్ బాస్కో స్కూల్‌తో సహా వివిధ విద్యా సంస్థల్లోని 187 నుంచి 257 వరకు ఉన్న పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలు ఓటర్లకు సులభంగా అందుబాటులో ఉన్నాయా లేదా, ఓటర్లకు మార్గనిర్దేశం చేయడానికి సరైన సంకేతాలు చూపడానికి వీలు ఉందా తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లు, ఎన్నికల సిబ్బంది భద్రతపై ప్రతి పోలింగ్ కేంద్రంలో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఓటర్లు, పోలింగ్ సిబ్బందికి అవసరమైన తాగు నీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలు, సీటింగ్ ఏర్పాట్ల లభ్యతను పరిశీలించి అధికారులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు.

316 మందికి వైద్య పరీక్షలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ పోస్టాఫీస్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎంజే నాయుడు హాస్పిటల్స్ వైద్య బృందం పాల్గొని రోగులకు బీపీ, షుగర్, ఎముకల అరుగుదల పరీక్షలను నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొత్తం 316 మంది రోగులకు పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. హాస్పిటల్ గౌరవ చైర్మన్ వావిలాల రజనీకాంత్‌శర్మ, పోస్టు మాస్టర్లు ఫణీ, ఏసు, ఇమ్మానుయేల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.రమేష్ పాల్గొన్నారు.

వేద సంస్కృతిని పరిరక్షించుకోవాలి



విజయవాడకల్చరల్: వేద సంస్కృతిని పరిరక్షించుకోవాలని గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి అనుగ్రహ భాషణ చేశారు. అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల మహోత్సవంలో భాగంగా బుధవారం స్వామి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. స్వామి మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మం విశిష్టమైనది దానిని పరిరక్షించుకోవాలని సూచించారు. మంగళమూర్తి వినాయకుడని ఆయనను సేవించుకోవడం శ్రేయోదాయకమన్నారు. బ్రాహ్మణులు నిత్య అనుష్ఠానపరులై సమాజానికి మార్గదర్శిగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. భారతీయ ఆధ్యాత్మిక వైభవం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమం కోసం కృషి చేస్తోందని తెలిపారు. వినాయక విగ్రహానికి స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణి మూర్తి, అమరావతి బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊటుకూరు పార్థసారథి, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి దశరథ రమేష్, కోశాధికారి అనుమల శేఖర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ వినాయకనగర్‌లో వినాయక చవితి మహోత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం దీపోత్సవం జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళలు దీపోత్సవంలో పాల్గొని లింగాకారంలో దీపాలను వెలిగించి వినాయకునికి పూజలు చేశారు. కార్యక్రమాలను రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి పర్యవేక్షించారు. శ్రీనగర్ కాలనీలో వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ కటారి వెంకట సాయి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు జరిగాయి. సాయికృష్ణ పర్యవేక్షించారు.

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా విజయ వినాయకుడు చందన అలంకారంలో భక్తుల పూజలు అందుకున్నారు. స్వామివారిని చందనంతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు అర్చనలు చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



నమూనా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డిప్యూటీ మేయర్ శ్రీశైలజ, కార్పొరేటర్లు, లబ్ధిదారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో వైఎస్సార్ ఆసరా పెండింగ్ లబ్ధిదారులకు నగదు జమ కార్యక్రమం బుధవారం జరిగింది. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయనే విశ్వాసాన్ని బలంగా నమ్మిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అన్నారు. రాష్ట్రంలోని మహిళల తలరాతలను మార్చేలా జగనన్న సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలోని 33,940 మంది పొదుపు సంఘాల మహిళలకు మూడో విడత ఆసరా ద్వారా 29.53 కోట్ల రూపాయల లబ్ధి చేకూర్చామన్నారు. మొత్తంగా మూడు విడతలలో రూ.88.65 కోట్లు అక్కచెల్లెమ్మలకు అందించామని తెలిపారు. అనంతరం నమూనా చెక్కును అందజేశారు. పీఓ యూసీడీ శకుంతల, సీడీఓ జగదీశ్వరి, కార్పొరేటర్లు ఎండీ షాహీనా సుల్తానా, ఇసరపు దేవీ, ఉమ్మడి రమాదేవి, కుక్కల అనిత, పెనుమత్స శిరీష, ఉద్దంటి సునీత, నాయకులు ఆత్మకూరు సుబ్బారావు, సుందర్ పాల్, రాజా రమేష్, సురేష్, రమేష్, సత్యం, ఎండీ హఫీజుల్లా, వెంకట్రావు, విజయ్, వెన్నం రత్నారావు, మేడేపల్లి ఝాన్సీ పాల్గొన్నారు.

• వైఎస్సార్ సీపీ ర్యాలీ



మాజీ సీఎం చంద్రబాబునాయుడు అరెస్టును స్వాగతిస్తూ ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, గొల్లపూడి గ్రామ వైఎస్సార్ సీపీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం గొల్లపూడిలో సంఘీభావంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి మద్దతుగా పెద్ద సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు తరలివచ్చారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, సీనియర్ నాయకులు చిన్ని, శివాజీ ఏఎంసీ చైర్మన్ కారంపూడి సురేష్, సహకార బ్యాంక్ చైర్మన్ బొర్రా వెంకట్రావు, వైస్ ఎంపీపీ వేమూరి సురేష్, మాజీ ఎంపీపీ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు. – చిట్టినగర్(విజయవాడపశ్చిమ)

కొనసాగుతున్న చవితి ఉత్సవాలు



విజయదుర్గానగర్‌లో భోజనాలు వడ్డిస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి



వీవీ నరసరాజు రోడ్డులో పూజలు చేస్తున్న కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినాయక చవితి వేడుకలు బుధవారం మూడో రోజుకు చేరుకున్నాయి. దుర్గా అగ్రహారంలో పంచముఖ వినాయక స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. పసుపుతోట వినాయక మందిరంలో వినాయక చవితి ఉత్సవాలలో ట్రాఫిక్ సీఐ బాల మురళీకృష్ణ, కార్పొరేటర్ పెనుమత్స శిరీష పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం పాల్గొన్నారు. మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులోని వినాయక చవితి ఉత్సవాల్లో కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమాలను గడ్డం మేస్త్రి పర్యవేక్షించారు. 30వ డివిజన్‌లో జరిగిన వినాయక చవితి ఉత్సవాల్లో కార్పొరేటర్ బి.జానారెడ్డి పాల్గొని పూజలు చేశారు. అలాగే విజయదుర్గానగర్‌లో వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదానంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని భోజనాలు వడ్డించారు. 3 వేల మందికి అన్నదానం చేశారు. దావు బుచ్చయ్యకాలనీ 9వ లైనులో పర్యావరణ గణపతికి విశేషంగా అర్చనలు. పూజలు నిర్వహించారు.

మరపురాని మహానటుడు అక్కినేని



అక్కినేని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): చలనచిత్ర పరిశ్రమలో మరపురాని మహానటుడు నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు అని సీనియర్ లయన్స్ నాయకుడు కొల్లూరి కొనియాడారు. డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన బుధవారం అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సొసైటీ అధ్యక్షుడు బి.వసంతకుమార్‌తో కలిసి అక్కినేని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అక్కినేని చేసిన సేవలను గుర్తు చేశారు. భారత చలనచిత్ర పరిశ్రమలో తెలుగువారి ఖ్యాతిని చాటిన మహానటుడు అక్కినేని అన్నారు. సొసైటీ అధ్యక్షుడు బి.వసంతకుమార్ మాట్లాడుతూ తన నటనతో అక్కినేని అభిమానుల మనసుల్లో చిరస్మరణీయ స్థానం సంపాదించుకున్నారన్నారు. నేడు ఆయన భౌతికంగా లేకున్నప్పటికీ ప్రతీ ఒక్కరి హృదయాలలో నిలిచే ఉన్నారని చెప్పారు. అక్కినేని విగ్రహాన్ని కళాక్షేత్రంలో నెలకొల్పే విధంగా తమ సొసైటీకి అనుమతులు ఇవ్వాలని కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. అనంతరం దుర్గాపురంలో మొక్కలు నాటి, మాతృదేవోభవ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కొండాయగుంట రాము, గుర్రం ఏడుకొండలు, బోడి ఆంజనేయరాజు, మండ రాము, పైడిపాటి వెంకన్న, డి.లక్ష్మికుమారి, శెనగశెట్టి హరిబాబు పాల్గొన్నారు.

ఎస్టీవీఆర్ హైస్కూల్ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉమ్మడి కృష్ణా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ – 16, 18 విభాగాల్లో దుర్గాపురం ఎస్టీవీఆర్ నగరపాలకసంస్థ విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల పదో తరగతి విద్యార్థి బి.ప్రవల్లిక అండర్ – 16 మూడు వేల మీటర్ల రేస్ వాక్ ఈవెంట్‌లో, కె.మోహన్ రావు అండర్ – 18 డిస్కస్ త్రో ఈవెంట్‌లో ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం పాఠశాలలో ప్రవల్లిక, మోహన్‌రావుకు అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఎం ఎం.సూర్యప్రభ మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర చాంపియన్ షిప్‌నకు ఎంపిక కావటం ఆనందంగా ఉందన్నారు. వీరిని మరింత మంది విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు, ఉపాధ్యాయురాలు ఎల్.విజయలక్ష్మి, ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి నగరానికి, పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల మంజూరు



రేషన్ కార్డులు అందజేస్తున్న కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు మంజూరు చేస్తున్నామని 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి అన్నారు. స్థానిక 29వ డివిజన్‌లో నూతనంగా మంజూరైన లబ్ధిదారులకు రేషన్ కార్డులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో అందినకాడికి దోచు కున్నారని, కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అర్హులను గుర్తించి తలుపుతట్టి మరీ వారి ఇంటి వద్దనే రేషన్ కార్డులు అందజేస్తున్నామన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ప్రతి ఇంటా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. అనంతరం డివిజన్‌లో నూతనంగా మంజూరైన 35 రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటో ఎగ్జిబిషన్‌తో విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఫొటో ఎగ్జిబిషన్‌తో విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా హఫీజుల్లా అన్నారు. సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎలిమెంటరీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన నేచర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా విద్యార్థుల్లో ఆయా రంగాలపై ఉన్న విజ్ఞానం, ఆసక్తి మరింత పెరుగుతుందన్నారు. తమ పాఠ్య పుస్తకాలకు మాత్రమే పరిమితమయ్యే విద్యార్థులకు ప్రపంచంలోని మిగిలిన విషయాలను కూడా ఫొటో ప్రదర్శన ద్వారా తెలియచేయడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు కూడా ప్రపంచ స్థాయి అంశాలను వివరించాలనే స్ఫూర్తితో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేయడం సంతోషంగా ఉందన్నారు. మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఇదే విధంగా నిరుపేద విద్యార్థులు ప్రపంచస్థాయిలో రాణించాలనే ఆకాంక్షతో ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. స్కూల్ హెచ్ఎం ఎం.ఎస్.ఇమామ్ బాషా, ఫొటోగ్రఫీ అకాడమీ ఫౌండర్ చైర్మన్ టి.శ్రీనివాస రెడ్డి, ఫొటో ఎగ్జిబిషన్ నిర్వాహకులు, స్టాఫ్ సెక్రెటరీ డి.పూర్ణచంద్రరావు, హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం మనోహర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• ముమ్మరంగా కొండచరియల తొలగింపు



ఇటీవల కురిసిన వర్షాలకు దుర్గా ఘాట్ సమీపంలో భారీగా కొండచరియలు విరిగి రోడ్డుపై పడ్డాయి. ఆ ప్రాంతంలో మరిన్ని కొండచరియలు విరిగి పడే అవకాశం ఉండడంతో ముందస్తుగా కొండచరియలను తొలగించే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ